తమ వ్యాసాన్ని చదువుతూ "దేశము, కాలము ఈ ప్రశ్నకి సమాధానాన్ని నిర్ణయిస్తాయి" అన్నారు. జతీంద్రనాథ దాసు, పొట్టిశ్రీరాములు, గాంధిజీ మొదలయినవారు తాముగా కల్పించు కొన్న బాధల్ని వివరిస్తూ, "వారి ఆత్మ హింస వైయక్తిక పరిధిని మించి, ప్రజానీకంలో సామాజిక, రాజకీయ చైతన్య ఉద్దీపనకు ఉద్దేశించినది. కనకనే అది త్యాగం అయింది" అన్నారు "త్యాగ శీలాన్ని నిర్ణయించడంలో మనం గమనించేది జయాపజయాలు కాదు ఆయా సమస్యల సామాజిక ప్రాముఖ్యం, వానియెడ ప్రజలలోవున్న చైతన్యోద్దీప్తి, మనం అందు కుపయోగించే మార్గమూ— ఇవన్నీ గణనకు వస్తాయి."

రెండో యుద్ధకాలంలో సోవియట్ సైనికుల ఆత్మ త్యాగాలకు లభించిన ప్రశంసను, జపానీ ఆత్మహత్యాకారి దళాలకు లభించిన అభిశంస నలు వివరించి ఇల్లా అన్నారు. "ఒకరు శత్రువు నుంచి దేశాన్ని రక్షించుకొనేందుకు, ఫాసిజం నుంచి ప్రపంచాన్ని విముక్తం చేసేందుకు ఆత్మ త్యాగం చేశారు. రెండోవారు ఇతరుల దేశాల్ని ధ్వంసం చేయడానికి ఉపకరణం అయారు. ఒకే తరహా ఘటనలయినా వాని లక్ష్యాలు వాటి విలువలను నిర్ణయిస్తాయి"

ఆఫీసరు మాధవరావు బంధుప్రీతి చూపి, అధిక విద్యావంతుల్ని వదలి తనకు ఉపకారం చేసినా, రాజారావు పాత్ర దానిని హర్షించక నిరాకరించడం త్యాగమేగాక, తప్పు దారిన పడ్డ ఆఫీసరును దారికి తేవడం అభినందించదగినదే నన్నారు కుమారి వింజమూరి రాధారాణి.

ఈ మాదిరి త్యాగాలవలన సమాజంలో జరిగే అన్యాయాలు కడముట్టుతాయనే ఆశ కనబడ్డం లేదనీ, కథలోని ఆఫీసరువంటివారు అధిక విద్యావంతుల్నీ, అర్హుల్నీ వదలి తన అను కూలాన్ని పట్టి అనర్హులతో ఉద్యోగాలు భర్తీ చేయక నేగ్యారంటీ ఏమీలేదనీ అన్నారు శ్రీభవణి.

వాక్చిత్రం — రచన–బొ. సూ.

## ఎవరికి వారే...

### (లేదా కమ్యూనికేషన్ గేప్)

"ఏమండోయ్, ఎప్పుడు రావడం?"

"ఎవరు? రావడమేమిటి?"

"మీరే, ఎప్పుడు రావడం?"

"నేనా? ఎక్కడ నుంచి?"

"మీరే, అమెరికా వెళ్లి తిరిగెప్పుడొచ్చారు?"

"నేను అమెరికా వెళ్లేనా?

"వెళ్లలేదా?"

"వెళ్తే తిరిగొస్తానా?"

"అదేమిటి?"

"అదేమిటేమిటి?"

"మీరు అమెరికా వెళ్లేరా, లేదా?"

"వెళ్ళేనని ఎవరు చెప్పేరు?"

"అసలు మీరు ఏ. డి. భాస్కరం గారు కాదూ?"

"కాదంటే నమ్ముతారా?"

"మరెవరు మీరు?"

"మీరనుకున్న మనిషిని కానప్పుడు ఎవ రైతేనేం?"

"మీరు భాస్కరం గారు కావంటారా? నిజమేనా?"

"మర్యాదగా మాట్లాడవయ్యా, నేను అబద్ధా లాడతానంటావా?"

"మర్యాదలేంది నీకా, నాకా? ఏం పెద్దమనిషి వయ్యా, నువ్వు అబద్ధాలాడుతున్నావని నేనన్నా నటయ్యా?"

"చాల్లేవయ్యా, నీతో అబద్ధమాడితే నాకేం లాభం?"

"నువ్వు నిజం చెబితే మాత్రం నాకేం లాభం?

"లాభంలేందీ నన్నెందుకు పలకరించా వయ్యా?"

"పలకరించడం పొరపాటంటావా?"

"ఆహా, లాభంలేని పలకరింపు ఎందు కయ్యా?"

"ఇంతకీ నువ్వనేదేమిటి?"

"ఇంతకీ నువ్వు నన్ను అనమనేదేమిటి?"